సాక్షి సంగారెడ్డి

బుధవారం । 19 । జూన్ । 2024



అతివలకు.. ఆర్థిక స్వావలంబన

స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు అందించి ఆర్థికంగా బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

వివరాలు 8లో ▸



పనులను వేగిరం చేయండి

గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

వివరాలు 9లో ▸



పెట్టుబడి సాయం అందేనా?

వానాకాలం సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2025 సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి జులై 3వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపికకు జులై 10వ తేదీన పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు www.tfbcrtudycircecff.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి హైదరాబాదులోని బీసీ స్టడీ సర్కిల్‌లో జులై 18వ తేదీ నుంచి ఏప్రిల్ 18వ(2025)తేదీ వరకు ఉచిత శిక్షణ తోపాటు ప్రయాణ ఖర్చులు, బుక్స్ అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 08455277015, 9949592991 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత కుమారి

సంగారెడ్డి : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీఓ వసంతకుమారి సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే పరిశ్రమలలో జరిగే ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశ్రమలలోని ప్రతీ అంశానికి సంబంధించిన వివరాలు బోర్డుపై పొందుపర్చాలని ఆదేశించారు. సమావేశంలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

రేపు అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 20న ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారి వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీలో 100 అప్రెంటీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లతో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 08455271010 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తింపులేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న తెంకటి కుమార్

నారాయణఖేడ్: ఉమ్మడి మెదక్ జిల్లాలో అనుమతిలేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో ఆయన మాట్లాడుతూ సదుపాయాలు లేని భవనాల్లో స్కూళ్లు నడుపుతూ యాజమాన్యం ఫీజుల దోపిడీకి తెగబడుతుందని ఆరోపించారు. షట్టర్లు అద్దెకు తీసుకుని పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సామగ్రి విక్రయాలు కొనసాగిస్తున్నారన్నారు. సురేందర్, మహేష్, వేణు పాల్గొన్నారు.

అనుమతి లేని ఆస్పత్రి సీజ్



చింతలచెరువు గ్రామంలో ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్ఓ గాయత్రీ దేవి

హత్నూర (సంగారెడ్డి): జిల్లాలో ఎవరైనా ఆర్‌ఎంపీలు అనుమతి లేకుండా క్లినిక్ నిర్వహించినా, తమ పరిధికి మించి వైద్యం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ గాయత్రీదేవి హెచ్చరించారు. మంగళవారం హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలో ఆర్‌ఎంపీ రవీందర్ అనుమతి లేకుండా 8 బెడ్ల ఆస్పత్రి నిర్వహిస్తూ చికిత్స అందిస్తున్నట్లు సమాచారం తెలియడంతో డీఎంహెచ్ఓ స్పందించారు. చింతలచెరువు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నేత్రావతితో కలిసి ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్లినిక్‌లో డిస్పోజబుల్ సిరంజిలను వేడి చేసి వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. అలాగే బయో మెడికల్ వేస్ట్ సంచులు ఆస్పత్రి ఆవరణలో ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆసుపత్రికి అనుసంధానంగా టెన్త్ చదివిన అమ్మాయితో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారని చెప్పారు.

డ్రగ్స్ దందా

పారిశ్రామిక వాడలో యథేచ్ఛగా తయారీ

- గుట్టుగా ల్యాబ్‌ల నిర్వహణ
- పట్టణ ప్రాంతాలకు రవాణా
- టీజీ న్యాబ్, పోలీసుల నిఘా
- ఏడు నెలల్లో మూడు డ్రగ్ కేంద్రాలపై దాడులు
- అయినా ఆగని అక్రమ వ్యాపారం



డ్రగ్ తయారీ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిల్లాలో డ్రగ్స్ దందా కలకలం సృష్టిస్తోంది. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. హైదరాబాద్ సమీప ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేస్తున్నారు. వాటిని ఇతర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. డ్రగ్స్ తయారీకి ఏకంగా చిన్నపాటి ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకొని మత్తు పదార్థాల తయారీకి తెగబడుతున్నారు. దొరికితే దొంగ.. లేదంటే దొర అన్నట్లు వీరి వ్యాపారం సాగుతోంది. అధికారులు దాడులు నిర్వహిస్తున్నా అక్రమార్కుల డ్రగ్ దందాకు అడ్డుకట్టవేయలేకపోతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, పాశమైలారం, సంగారెడ్డి, హత్నూర తదితర పారిశ్రామిక వాడలు ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు లక్షల సంఖ్యలో ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వీటిల్లో 35 వేల వరకు కెమిస్ట్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ తయారీలో కెమిస్ట్‌లదే కీలక పాత్ర. వీరికి డ్రగ్స్ తయారీపై పట్టు అధికంగా ఉంటుంది. దీంతో డబ్బులు ఎక్కువగా సంపాదించాలనే దురుద్దేశంతో నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేసేందుకు పక్కదారులు తొక్కుతున్నారు. డ్రగ్గిస్టులు, కెమిస్టులతో కలిసి డ్రగ్స్‌ను తయారు చేసేందుకు అక్రమార్కులు యత్నిస్తున్నారు. కొంత కాలం వీరి వ్యాపారం బాగానే జరుగుతున్నా అధికారుల నిఘాతో దొరికి పోతున్నారు.

మారుమూల ప్రాంతాల్లో..

డ్రగ్స్‌ను తయారు చేసేందుకు ఎవరికి అనుమానం రాకుండా ఉండే స్థలాలను అక్రమార్కులు ఎంచుకుంటున్నారు. అటవీ ప్రాంతాలతో పాటు ఫాంహౌజ్‌లు, కోళ్ల ఫారాలు, మూతపడిన పరిశ్రమలను తయారీ కేంద్రాలుగా మారుస్తున్నారు. అయితే గ్రామాల్లో కూడా తగిన నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి పరిశ్రమనే ఏర్పాటు చేశారు

డ్రగ్స్‌ను తయారు చేసేందుకు అక్రమార్కులు ఏకంగా చిన్నపాటి పరిశ్రమనే స్థాపిస్తున్నారు. సుమారు రూ.25లక్షల వరకు వెచ్చించి డ్రగ్స్‌ను తయారు చేసేందుకు వసతులు సమకూర్చుకుంటున్నారు. డ్రగ్స్ తయారీ కేంద్రంలో రియాక్టర్‌తో పాటు డ్రయ్యర్, ఏసీ ఇతర విలువైన వస్తువులను వినియోగిస్తున్నారు. ఇక్కడ ఏర్పాట్లను చూస్తే పారిశ్రామికవేత్తలే ముక్కున వేలేసుకునేలా ఉన్నాయి.

యువత పక్కదారి

డ్రగ్స్‌కు యువత బానిసలవుతున్నారు. హైదరాబాద్‌కు సమీపంలో సంగారెడ్డి జిల్లా ఉండటంతో ఇక్కడ తయారు చేసిన డ్రగ్స్‌ను సులువుగా పబ్‌లు, పలు రకాల స్టార్ హోటల్స్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ఉన్న కల్లు దుకాణాలకు ఆల్ప్రాజోలంను తరలిస్తున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు కల్లుకు బానిసలవుతున్నారు. గ్రామాల యువత కూడా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని తెలుస్తోంది. డ్రగ్స్‌పై గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని యువత తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డ్రగ్ తయారీ గురించి తెలిస్తే సమాచారం ఇవ్వండి

డ్రగ్స్ దందాను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా నిఘా పెంచాం. టీజీ న్యాబ్ అధికారులతో కలిసి సంయుక్తంగా డ్రగ్ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నాం. డ్రగ్స్ తయారీకి సంబంధించిన సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– రూపేశ్, ఎస్పీ

ఏడు నెలల్లో సీజ్ చేసిన డ్రగ్స్ వివరాలు



- జిన్నారం మండలం కొడకంచిలో గతేడాది డిసెంబర్‌లో అటవీ ప్రాంతంలో నార్డజీపమ్ అనే డ్రగ్స్ తయారీ ముఠాను యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి పట్టుకున్నారు. డ్రగ్ తయారీలో కెమిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తిదే కీలక పాత్ర. ఈ దాడుల్లో రూ.3కోట్ల విలువైన డ్రగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులో గత ఏడాది డిసెంబర్ నెలాఖరులో ఓ ఇంట్లో నిషేధిత ఆల్ప్రాజోలంను తయారు చేస్తున్న ఓ ముఠాను టీజీ న్యాబ్, జిల్లా పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి పట్టుకున్నారు. వారి నుంచి రూ.70లక్షల విలువైన డ్రగ్, ఇతర ముడిసరుకు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- తాజాగా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని ఓ కోళ్ల ఫారంలో ఏకంగా రియాక్టర్ కలిగిన ఓ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి నిషేధిత ఆల్ప్రాజోలంను తయారు చేస్తున్న ముఠాను టీజీ న్యాబ్, పోలీసులు పట్టుకున్నారు. ఈ దాడుల్లో రూ.కోటి విలువైన డ్రగ్‌తో పాటు ఇందుకు ఉపయోగించే ముడి సరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ



జర్నలిస్టులకు ఆర్డర్ కాపీ ఇస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరుతూ డీఈఓ వెంకటేశ్వర్లుకు సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎస్‌డబ్ల్యుజేఏ)ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. స్పందించిన డీఈఓ మంగళవారం దీనికి సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలకు సూచించారు. డీఈఓ ఆదేశాలు జారీ చేయడం పట్ల సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయినాథ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉప అధ్యక్షుడు ఎర్ర వీరేందర్ గౌడ్, సలహాదారులు సునీల్, వసంత్ కుమార్, ట్రెజరర్ నాగభూషణం హర్షం వ్యక్తం చేశారు.

రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు

నారాయణఖేడ్: కళాశాలల విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆదేశాల మేరకు రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేశారు. ఖేడ్ మండలం జూకల్ శివారులో ఉన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల సమీపంలో రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేను విద్యార్థులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. సమస్య పరిష్కరించాలని డిపో అధికారులకు సూచించారు. మంగళవారం డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు కళాశాలల సమీపంలో రిక్వెస్ట్‌స్టాఫ్ కోసం స్థలాన్ని పరిశీలించి బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా దత్తాత్రేయ వార్షికోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయ మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర్ మహారాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమాల్లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, సాగర్ షెట్కార్, వీరశెట్టి, సాయిలు, శివకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్, నగేష్, శివలింగ్‌పటేల్, హన్మండ్లు, కాశీనాథ్‌పటేల్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

శిఖం భూముల కబ్జాపై విచారణ



శిఖం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్రాహ్మణగూడ గ్రామ శివారులోని చెరువు కుంటల శిఖం భూమి కబ్జాపై నీటిపారుదలశాఖ ఏఈ వైష్ణవి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ శివారులోని అయ్యగారి చెరువు, గునుకుంట, నక్కలకుంటతో పాటు హత్నూర గ్రామానికి చెందిన తాళిమి చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన కొంతమంది కబ్జా చేసి సాగు చేస్తున్నారని సమాచారం మేరకు చెరువు కుంటల భూములను పరిశీలించినట్లు తెలిపారు. శిఖం భూములు, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో పాటు తహసీల్దార్‌కు అందజేస్తామని తెలిపారు. ఏఈఈ డిప్యూటీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు

జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

వట్‌పల్లి(అందోల్): సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ఉత్తమమని జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని అన్నారు. మంగళవారం అందోల్ మండల పరిధిలోని డాకూర్ రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. వరి, మొక్కజొన్న సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వల్పకాలిక రకాలైన రాజేంద్రనగర్ వరి 229325 సాగు చేసుకోవాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చకూడదని, వాటి వల్ల సేంద్రియ కర్బనం, వానపాముల వృద్ధి తగ్గుతుందని సూచించారు. మధ్యకాలిక రకాలైన ఆర్ఎన్ఆర్15048 పంట కాలం ఎక్కువగా ఉండటంతో జులై మొదటి వారంలో విత్తుకోవడం మంచిదన్నారు. సన్నారకాలైన జేజీఎల్ 27356, ఆర్ఎన్ఆర్ 31479 సాగు చేసుకోవాలని సూచించారు. దొడ్డు రకాలైన ఆర్ఎన్ఆర్29325ను కూడా విత్తుకుంటే బాగుంటుందని తెలిపారు. దీని దిగుబడి ఎకరాకు 33 నుంచి 34 క్వింటాళ్లు వస్తుందన్నారు. అదేవిధంగా నూనెగింజల పంటలను సాగు చేయాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అరుణ, ఏఓ విజయ రత్న, పుల్కల్ వ్యవసాయ అధికారి సారిక, ఆదర్శ రైతు జనార్దన్ పాల్గొన్నారు.

24న జాబ్ మేళాకు తరలిరండి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నియోజకవర్గ యువత కోసం ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఇందులో సుమారు 5వేల వరకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ యువజన శాఖ నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు ప్రతి గ్రామం నుంచి యువత తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీజీ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరూ ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విదేశీ స్కిల్స్ ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, నాయకులు చందు, జంగపల్లి అయిలయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మంత్రి ప్రత్యేక పూజలు

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి ఒడి బియ్యం, పట్టుం సమర్పించారు. అలాగే బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం తదితరులు



ఆందోళన చేస్తున్న రైతులు

పరిహారం కోసం రైతుల ఆందోళన

జహీరాబాద్: కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వాలని కోరుతూ బాధిత రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం వెంకటాపూర్, కొత్తూర్(డి) గ్రామాలకు చెందిన రైతులు జహీరాబాద్ ఆర్డీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. గత ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని 700 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించిందని, ఇందుకు సంబంధించి వంద మంది రైతులకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో అందరికీ పరిహారం ఇవ్వలేదని, ఇచ్చినవారికి కూడా పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

లీకేజీ బాధ్యులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి టౌన్ : 'నీట్' పేపర్‌ను లీక్ చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీకేజీ పై కేంద్రం స్పందించాలని, అవకతవకలు లేకుండా రీ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించండి



బాలరక్ష ఆశ్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : బాలరక్ష, వృద్ధుల ఆశ్రమ భవనాలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బాల రక్ష భవనం, వృద్ధుల ఆశ్రమ కేంద్రాలను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలను దత్తతకు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. చిన్నపిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించి పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించి మహిళలకు అందే సేవల గురించి తెలుసుకున్నారు. 181 వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినుల ఆందోళన

ములుగు(గజ్వేల్): లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. అధ్యాపకులు తమను దుర్భాషలాడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కొద్దిసేపు వారి ఆందోళనతో కళాశాలలో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. అధ్యాపకుల తీరు వల్ల తమ కోర్సులలో ఏకాగ్రత సాధించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు జోక్యం చేసుకొని నచ్చజెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

స్తంభాలు వేశారు.. వదిలేశారు

ఆగిన 'టౌన్‌హాల్' నిర్మాణం

- నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభం
- రూ.కోటి నిధులు మంజూరు
- కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ



అసంపూర్తిగా టౌన్ హాలు నిర్మాణం

జోగిపేట(అందోల్): నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన 'టౌన్‌హాల్' నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.. అనే చందంలా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. నిధులున్నా పనులను అసంపూర్తిగా వదిలేశారు.

అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని అందోల్ శివారులో టౌన్‌హాల్ నిర్మాణానికి టీయుఎఫ్ఐడీసీ కింద రూ.కోటి నిధులు గత ప్రభుత్వం మంజూరు చేసింది. 2020లో అప్పటి మంత్రి తన్నీరు హరీష్‌రావు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల క్రితం కేవలం 24 ఇనుప స్తంభాలు వేసి వదిలేశారు. ఈ పనులకు గాను రూ.20 లక్షల వరకు బిల్లులు ప్రజారోగ్య మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ మంజూరు చేసింది. ఆ బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్ మిగిలిన పనులు చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేశాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఈ నిర్మాణం పనులను ప్రారంభించిన గత పాలకవర్గ సభ్యులు త్వరగా ఆ పనులను పూర్తి చేయించే విషయమై చొరవ చూపెట్టలేదన్న విమర్శలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని అందోలు, జోగిపేట ప్రాంతాలకు చెందిన వారికి ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో టౌన్ హాలు నిర్మాణాన్ని చేపట్టారు. నాలుగేళ్లుగా పనులకు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో తిరిగి పనులు జరుగుతాయా?లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కాంట్రాక్టర్‌ను మార్చుతాం

అందోల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న టౌన్ హాలు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ తీసుకున్న శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ వారికి నోటీసులు జారీ చేశాం. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు రూ.20 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాం. పనులు నిలిపివేయడంతో కాంట్రాక్టర్‌కు రావాల్సిన మిగతా డబ్బులు ఆపేశాం. వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించేలా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమూర్తి, పబ్లిక్ హెల్త్ శాఖ డిప్యూటీ ఈఈ

క్లుప్తంగా

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదస్థలంలో కింద పడి ఉన్న బైకులు

టేక్మాల్(మెదక్): రెండు బైకులు ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పల్వంచ చౌరాస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కోరంపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యులు హన్మంతు వ్యవసాయ క్షేత్రంలోని మట్టి రోడ్డు నుంచి బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో అందోల్ మండలం డాకూర్‌కు చెందిన ఇద్దరు టేక్మాల్ నుంచి జోగిపేట వైపు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు పల్వంచ చౌరాస్తాలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో హన్మంతు తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆటోలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలి కన్నుమూత



నర్సమ్మ(ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు కన్నుమూసింది. ఈ సంఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మైస నర్సమ్మ(107)కు భర్త రాజయ్యతో పాటు నలుగురు కుమారులు, కూతురు సంతానం. భర్త రాజయ్యతో పాటు పెద్ద కొడుకు పోచయ్య గతంలో మృతిచెందారు. చిన్నకొడుకు స్వామి వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం మృతిచెందింది.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి



అంజాగౌడ్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అతికం అంజాగౌడ్ (53) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆటో మీద సంపాదనతో ఉన్న ఒక్క కూతురి వివాహం చేశాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటో తీసుకు వెళ్లే క్రమంలో చాతిలో తీవ్రమైన నొప్పి వస్తుందంటూ కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అంజాగౌడ్ తుది శ్వాస వదిలాడు. మృతుడికి భార్య గాయత్రి ఉన్నారు. ఆటో డ్రైవర్ మృతి పట్ల ధర్మారం, మిరుదొడ్డి ఆటో యూనియన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

అతివలకు.. ఆర్థిక స్వావలంబన

- జిల్లాకు బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యం రూ. 895.63 కోట్లు
- గతేడాది కంటే రూ. 146.95 కోట్లు అదనం
- ఒక్కో మహిళా సంఘానికి రూ. 20 లక్షలు మించకుండా రుణం
- అధికారుల ప్రత్యేక కార్యాచరణ



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

సిద్దిపేటరూరల్: స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు అందించి ఆర్థికంగా బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తద్వారా గేదెలు, గొర్రెలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారు. కిరాణా దుకాణాల నిర్వహణ, చిరు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు గాను జిల్లా యంత్రాంగం రూ. 895.63 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని నిర్దేశించింది. గతేడాది లక్ష్యం నెరవేరగా ఈ ఏడాది కూడా అధికారులు ప్రణాళికను రూపొందించారు.

గతేడాది కంటే అదనం

జిల్లాలో గతేడాది బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం రూ. 749.73 కోట్లుగా ఉంది. లక్ష్యానికి మించి రూ. 30. 41 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందించారు. దీంతో జిల్లాలో మహిళా సంఘాలు క్రమంగా చెల్లింపు చేయడంతో పాటుగా సీనియారిటీ ఎక్కువగా ఉన్న సంఘాల నివేదికను ప్రభుత్వం తీసుకుంది. దీంతో మరింతగా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ. 146. 95 కోట్ల రుణ లక్ష్యాన్ని అదనంగా నిర్దేశించుకున్నారు. గతంలో కంటే ఇప్పుడు ఒక్కో మహిళా సంఘానికి రూ. 20 లక్షలు మించకుండా రుణాలను అందించనున్నారు. అదే దిశగా ఈ ఏడాది రుణ లక్ష్యం నెరవేరేలా ఆరంభం నుంచే దృష్టి సారించారు.

ఉత్తమ జిల్లాగా సిద్దిపేట..

జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఏటా రుణాలు తీసుకుంటూ వాటిని చెల్లిస్తూ బ్యాంకుల్లో పొదుపులు చేసుకుంటున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్దేశించిన లక్ష్యాన్ని మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ ఉత్తమ జిల్లాగా సిద్దిపేట రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ప్రతి యేటా రుణ లక్ష్యాన్ని పెంచుతూ వస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి ఇచ్చిన లక్ష్యాన్ని నెరవేరుస్తూ వస్తుంది. గత సంవత్సరంతో పోలిస్తే 2024–25 సంవత్సరానికి ప్రభుత్వం రూ. 146.95 కోట్లు అదనంగా నిర్దేశించింది. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీని సంఘాల ఖాతాల్లో జమ చేస్తుంది.



లక్ష్యం ఇదే

జిల్లా వ్యాప్తంగా సీనియారిటీతో పాటుగా యాక్టివ్ ఉన్న గ్రూపులకు సంబంధించి 18,266 మహిళా స్వయం సహాయక సంఘాలున్నాయి. ఒక్కో మహిళా సంఘానికి 10–15 మంది చొప్పున సభ్యులు ఉంటారు. జిల్లాలో మొత్తంగా 1,93,583 మంది సభ్యులు ఉన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు చిన్న, పెద్ద వ్యాపారాలు నిర్వహించుకుని, ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందుకుంటున్నారు. ఈ సంవత్సరం రుణ లక్ష్యం రూ. 895.63 కోట్లు చేరుకునేందుకు డీఆర్డీఏ, మెప్మా అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

మహిళల సాధికారికత కోసమే



మహిళల ఆర్థిక సాధికారికత కోసం రుణాలు ఎంతో దోహదపడతాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు వ్యాపారాలు, పలు రకాల ఉత్పత్తుల తయారీ వంటి వాటిని ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందేందుకు రుణాలు ఉపయోగపడతాయి. ఇప్పటికే జిల్లాలో లక్ష్యానికి మించి రుణాలు అందిస్తున్నాం. ప్రతి సంవత్సరం రుణ లక్ష్యం పెంచుతుండటం మంచి విషయం. ఇదే విధంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– జయదేవ్ ఆర్యా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

బారసాలకు వచ్చి..

బావిలో పడి యువకుడి గల్లంతు



ఘటన స్థలం వద్ద ఫైరింజన్

దుబ్బాకరూరల్: స్నేహితుడి కొడుకు బారసాలకు వచ్చిన యువకుడు మద్యమత్తులో మూత్ర విసర్జనకు వెళ్లి బావిలో పడి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండలంలోని అప్పనపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారానికి చెందిన ప్రశాంత్(22) తన స్నేహితుడి కొడుకు బారసాల కార్యక్రమం కోసం వచ్చాడు. స్నేహితులతో కలిసి తాను కూడా గ్రామ శివారులో వెళ్లి మద్యం తాగారు. ఆ తర్వాత మూత్ర విసర్జనకు వెళ్లి రోడ్డు పక్కనున్న బావిలో పడిపోయాడు. ఆ విషయం గమనించకుండా స్నేహితులు బైక్‌పై కొద్ది దూరం వెళ్లి వెనకాల రాకపోయే సరికి ఆ ప్రాంతానికి తిరిగెళ్లారు. అక్కడ ఉన్న వారు ప్రశాంత్ బావిలో పడిన విషయాన్ని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా సంఘటన స్థలానికి చేరుకొని ఫైరింజన్ సహాయంతో బావిలో నీటిని తోడేస్తున్నారు.

సీబీఐ విచారణ జరిపించాలి: ఎస్ఎఫ్ఐ



నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

జోగిపేట(అందోల్): నీట్ గ్రేస్ మార్కులు రద్దు చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ అన్నారు. మంగళవారం జోగిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌టీఏ చైర్మన్, డైరెక్టర్లను తప్పించి వారిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లింగరాజు, హరి ప్రభా, విజయ్, సుమంత్ , చరణ్, వైష్ణవి, హారిక, ప్రవళిక, గాయత్రి, పూజ తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడగ జంగాల కాలనీకి చెందిన సమ్మయ్య (35) కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇటీవలే పెద్ద కూతురు వివాహం చేశాడు. చేసిన అప్పులు తీర్చ లేక మనస్తాపం చెందిన అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారం క్రితమే వ్యక్తి..

జహీరాబాద్ టౌన్: గుర్తు తెలియని మృతదేహాన్ని పట్టణంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తించారు. టౌన్ ఎస్ఐ. శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అహ్మద్‌నగర్ ప్రాంతంలో రైల్వే ట్రాక్ పక్కన కుళ్లిపోయిన గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం కాలనీవాసులు గుర్తించారు. వారం రోజుల క్రితం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. అతని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుంది. ఇతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేవని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేనంతగా మారింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



దశరథ్ రెడ్డి (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.... అందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలం తాటిపల్లికి చెందిన దశరథ్ రెడ్డి(44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గుంత మర్పల్లి గ్రామ శివారులోని రామ మందిరానికి రోజూ వెళ్తుంటాడు. సోమవారం ఉదయం కూడా ఆలయానికి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి చేరుకోలేదు. దీంతో గ్రామ శివారులో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం మధ్యాహ్నం గుంత మర్పల్లి గ్రామశివారులోని నీలగిరి తోటలో కాలిపోయిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని బాధిత కుటుంబసభ్యులకు తెలియడంతో ఘటన స్థలానికి చేరుకొని గుర్తించి ఆపై కన్నీరుమున్నీరయ్యారు. హద్నూర్ ఎస్సై రామానాయుడు, ఝరాసంగం ఏఎస్ఐ గంగయ్య వివరాలు సేకరించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు టిప్పర్ల సీజ్



పట్టుబడిన టిప్పర్లు

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. మాసానిపల్లిలోని ఒక ప్రైవేట్ ఫాం హౌస్‌కు సర్వే నంబర్ 1,276 లోని మట్టిని అక్రమంగా 5 రోజులుగా తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారు గ్రామానికి వెళ్లి రెండు టిప్పర్లను అడ్డుకొని జోగిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వాహనాలను స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వాటిని సీజ్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి నిద్రించి ఉన్నాడు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అతని దగ్గరకు వెళ్లి నిద్ర లేపే యత్నం చేశాడు. ఎంతకీ స్పందించకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించాడు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దొంగిలించారు. ఈ సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారంలో జరిగింది. గ్రామంలోని సునిల్‌కు చెందిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి అపహరించుకుపోయారు. బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

దొంగతనానికి విఫలయత్నం

సిద్దిపేటకమాన్: వైన్ షాప్‌లో దొంగలు చోరీకి యత్నించిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మెదక్ రోడ్డులోని ఓ వైన్ షాప్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. నిర్వాహకులు వైన్ షాప్‌ను సోమవారం రాత్రి రోజూ మాదిరిగానే మూసేసి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చి దుకాణాన్ని తెరిచి చూస్తే పైన ఉన్న రేకులను తొలగించి చోరీకి యత్నించినట్లు గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో నగదు లేకపోవడంతో సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. బాధితుడు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కౌంటర్‌లో నగదు తస్కరణ

సిద్దిపేటఅర్బన్: వైన్స్‌లో దొంగలు పడి కౌంటర్‌లో డబ్బులు ఎత్తుకెళ్లిన ఘటనపై సిద్దిపేట రూరల్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ శివారులో ఉన్న మల్లికార్జున వైన్స్ ఉంది. రోజూ మాదిరిగానే వర్కర్లు సోమవారం రాత్రి వైన్స్‌ను బంద్ చేసి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత గుర్తు తెలియని దొంగలు పైకప్పును తొలగించి లోపలికి వచ్చి కౌంటర్‌లోని డబ్బులు సుమారు రూ. 37,900 ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం వైన్స్ తెరవడానికి వచ్చిన వర్కర్లు పైకప్పు తొలగించి ఉండటాన్ని గమనించారు. వెంటనే కౌంటర్ తాళం తీసి చూస్తే అందులో ఉండాల్సిన నగదు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు దొంగిలించారని క్యాషియర్ మహేశ్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

దుబ్బాకరూరల్: చెరువు శిఖం భూమిలో మట్టి పోసిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండలంలోని పోతారంలో జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు.. వడ్లవాని కుంటలో ఎఫ్టీఎల్ ల్యాండ్‌కు సంబంధించిన చెరువు శిఖం భూమిలో అచ్చుమాయిపల్లికి చెందిన అన్నబోయిన యాదగిరి.. మట్టి పోసి శిఖం భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. దీనిపై ఇరిగేషన్ ఏఈ రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కూచనపెల్లిలో వ్యక్తి దారుణ హత్య

- పోలీసుల అదుపులో భార్య, అనుమానితుడు



నర్సయ్య (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన హుస్నాబాద్ మండలం కూచనపెల్లిలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీకురు నర్సయ్య (55) ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి చంపారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో భార్య నిద్ర లేచి బయటకు వచ్చి చూస్తే భర్త రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి భయపడి ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి తెలిపింది. ఆ మేరకు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగగా సమీపంలో ఒకరి ఇంటికి వెళ్లి ఆగిపోయింది. అనుమానితుడిని, నర్సయ్య భార్య ఎల్లవ్వను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈక్రమంలో రాత్రి సమయంలో నర్సయ్యతో ఒకరు గొడవపడినట్లు పోలీసుల అదుపులోని వ్యక్తి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కుటుంబ కలహాలతో హత్య జరిగిందా? మరేతర కోణం దాగుందా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అలాగే అతడితో గొడవ పడిన మూడో వ్యక్తి ఎవరనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతుంది.

స్టార్టర్ డబ్బా తీగలు సరి చేస్తుండగా..

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు..



మల్లేశ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: కరెంటు షాక్‌తో యువ కౌలు రైతు మృతిచెందాడు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేటలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువ కౌలు రైతు గుండం మల్లేశ్ (38) తనకున్న 10 గుంటల భూమితోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలం వద్ద స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాకు ఉన్న తీగకు మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్ కు గురై మృతిచెందాడు. అతడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమార్తెలున్నారు. మల్లేశ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, ఎంపీటీసీ లక్ష్మి అశోక్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్ రాజు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. మల్లేశ్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

విద్యుత్ తీగ తెగి పడి..



ప్రభాకర్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని బండ పోసాన్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నవత తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గుండు ప్రభాకర్ (40) మంగళవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బోర్ మోటార్‌కు విద్యుత్ సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చూస్తుండగా 11 కేవీ కరెంట్ తీగ తెగి మీద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్లేట్ తీసేందుకు యత్నించి ఒకరు..

నీరు తాగేందుకు వెళ్లి మరొకరు..

- వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి



ప్రదీప్ కుమార్

పటాన్‌చెరు టౌన్: నీటి సంపులో పడిన ప్లేట్‌ను తీసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుమార్ జన(41)బతుకుదెరువు కోసం 6 నెలల క్రితం గ్రామస్తులతో కలిసి అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీకి వచ్చి ప్లంబర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తిన్న పాత్రలను సంపు వద్ద శుభ్రం చేస్తుండగా పొరబాటున చేయి జారి ఇందులో ప్లేట్ పడింది. దాన్ని బయటికి తీసేందుకు వంగగా ప్రమాదవశాత్తు ఇందులో పడ్డాడు. 17 అడుగుల లోతుండటంతో మునిగి పోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే బయటకు తీయగా అప్పటికే చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. విక్రమ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

నీళ్లు తాగుతుండగా..



శ్రీకాంత్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జిన్నారం మండలం గడ్డపోతారంలో మంగళవారం జరిగింది. సీఐ గంగాధర్ కథనం ప్రకారం.. కొడిపల్లి మండలం రాజ్‌పేట్‌కు చెందిన శ్రీకాంత్ (30) గడ్డపోతారానికి చెందిన నసీర్ దగ్గర పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా గేదెల మేత కోసం అతను గ్రామ శివారుకు వెళ్లాడు. సమీపంలోని నీటి సంపు వద్ద నీళ్లు తాగుతుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. దీంతో ఊపిరాడక శ్రీకాంత్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్య చేసింది బావే..

- చోరీ చేసిన బైక్‌ను దక్కించుకోవాలని..
- కల్లులో గడ్డిమందు కలిపిన వైనం
- నిందితుడి అరెస్టు, రిమాండ్

భిక్కనూరు: చోరీ చేసిన బైక్ తనకే దక్కాలనే ఆశతోనే బావమరిదిని హత్య చేసిన బావను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన కోటాని రంజిత్ తనకు వరుసకు బావ అయిన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెర్వుకు చెందిన జర్రిపోతుల బాబాశేఖర్‌తో కలిసి రామాయంపేటలో ఓ బైక్‌ను చోరీ చేశారు. వీరు ఈ నెల 3న భిక్కనూరులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగారు. దొంగిలించిన బైక్ తనకే దక్కాలనే దురుద్దేశంతో శేఖర్ ముందుగానే తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును రంజిత్‌ను మిర్చిలు తీసుకురమ్మని చెప్పి అతను తాగే కల్లు సీసాలో పోశాడు. కల్లు తాగిన రంజిత్ అపస్మారకస్థితిలోకి వెళ్లగానే శేఖర్ తన ఫోన్ ద్వారా రంజిత్ కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వారు వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 14న చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై సీఐ సంపత్ విచారణ చేపట్టగా రంజిత్ మృతికి శేఖర్ నిందితుడని గుర్తించి అతని వద్ద ఉన్న రెండు బైక్‌లు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బెంగళూర్‌లో డ్రాపింగ్‌కు వెళ్లి అదృశ్యం



శ్రీనివాస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్యాబ్ డ్రాపింగ్‌కు వెళ్లిన డ్రైవర్ అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తాండూరుకు చెందిన బి.శ్రీనివాస్ జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. కొమరంభీం కాలనీలో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 6న బెంగళూర్‌లో డ్రాపింగ్ ఉందని భార్య మహేశ్వరికి చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతని ఆచూకీ లభించలేదు. తెలిసిన మిత్రులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నరేందర్ రెడ్డి



నరేందర్ రెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలకు చెందిన వై.నరేందర్ రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటిందన్నారు. గ్రామగ్రామాన పార్టీ ఒక శక్తివంతంగా తయారైందన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తామన్నారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.